# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గత ప్రభుత్వ వైఫల్యాలా నుండి రాష్ట్రాన్ని పునఃనిర్మించాలనే లక్ష్యంగా పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.
- ❖ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22 వరకు జరుగుతాయని శాసనసభపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు.
- ❖ వ్యవసాయంలో సాంకేతికతను ఉపయోగిస్తామని మంత్రి పి. నారాయణ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

======================

గత ప్రభుత్వ వైఫల్యాలా నుండి రాష్ట్రాన్ని పునఃనిర్మించాలనే లక్ష్యంగా పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అంకెల పద్దును మించి ప్రజల ఆకాంక్షలు ఆశయాలను నెరవేర్చే దిశగా బడ్జెట్ రూపుదిద్దుకుందని మంత్రి తెలిపారు. ఈరోజు శాసనసభలో 2024-25 సంవత్సరానికి గానూ ప్రవేశ పెట్టిన పూర్తి బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ.... అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ఈ బడ్జెట్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 1 నుండి 12వ తరగతి విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ...

(వాయిస్ 23 సెకన్లు)

======================

అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22 వరకు జరుగుతాయని శాసనసభపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. రేపు బడ్జెట్ పై అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎమ్మెల్యేలందరికీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శనివారం కూడా సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బిల్లులు, చర్చలకు అనుగుణంగా కొన్ని రోజులు రెండు పూటలా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు.

======================

రాష్ట్రంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో సమగ్ర నూతన జలవిధానం రూపొందిస్తున్నామని పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈరోజు ఆయన శాసన మండలిలో వ్యవసాయ బడ్జెట్ పై మాట్లాడుతూ... కరువు రహిత రాష్ట్రంగా తీర్చి దిద్ది సాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి భద్రతను కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ ను పూర్తి చేయడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వంశధార రెండోదశ, వెలిగొండ ప్రాజెక్ట్, హంద్రీ నీవా సుజలస్రవంతి ప్రాజెక్ట్, టీబీపీ-హెచ్చెల్సీ వ్యవస్థ మెరుగుదల, చిన్న నీటిపారుదల, వాటర్ షెడ్స్, భూగర్భ జలాల నిర్వహణలతో సహా నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికతను ఉపయోగిస్తామని మంత్రి నారాయణ మాట్లాడుతూ...

(వాయిస్ 37 సెకన్లు)

======================

ప్రముఖ మృదంగ విద్వాంసులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత వి.కమలాకారరావు ఈరోజు ఉదయం రాజమహేంద్రవరంలో తుది శ్వాస విడిచారు. 1950 నుంచి వీరు ఆకాశవాణి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పలువురు సంగీత కళాకారులు, అభిమానులు వీరి మృతికి తమ సంతాపాన్ని ప్రకటించారు.

======================

నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ఈ రోజు సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడన ప్రభావంతో రేపటికి వర్ష సూచనలు... నెల్లూరు, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య , చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి  వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

విరామం

======================

ఎన్నికల హామీలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం వరుసగా అమలు చేస్తోందని సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై ఈరోజు అమరావతిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో ఇప్పటికే రెండు ప్రధాన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్లను 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచిందని, ఉచిత గ్యాస్ సిలిండర్ హామీ అమలులో భాగంగా 840 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. మరో రెండు పథకాల అమలు కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించామని మంత్రి వివరిస్తూ.....

(వాయిస్ 25 సెకన్లు)

=======================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అందుకుగాను వచ్చిన ప్రతీ అర్జీని అవగాహన చేసుకోవడం, అర్జీదారుని వద్దకు వెళ్లి సమస్య గూర్చి మాట్లాడాలని అధికారులకు సూచించారు. సమస్య సంబంధిత శాఖ పరిధిలోనిది కాకపోతే తెలియజేయడం, అందుకు గల కారణాలను వివరించడం, తదుపరి కార్యాచరణపై అర్జీదారునికి అవగాహన కల్పించడం వంటి పంచ సూత్రాలను పాటించాలని ఆమె తెలిపారు.

=======================

హైందవ ధర్మాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.. ఈరోజు శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నియోజకవర్గం సోంపేట మండలం అనంతపురం గ్రామంలో శ్రీ వేద గాయత్రి మహాదేవ యజ్ఞం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేయటం వల్ల లోకం సుభిక్షంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఆలయాల ప్రాముఖ్యత ప్రస్తుత తరానికి తెలియజేయవలసిన బాధ్యత అందరిపై ఉందని కేంద్రమంత్రి అన్నారు.

=======================

భారత తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యకమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ఎస్పీ గంగాధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేడు దేశంలోని ఎంతో ఖ్యాతి గడించిన ప్రముఖ విద్యా సంస్థల స్థాపనకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ....

(వాయిస్ 25 సెకన్లు)

=======================

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 07001 రైలు నంబరుతో తిరుపతి- సికింద్రాబాద్ మధ్య బుధవారం ప్రత్యేక రైలును నడపనున్నామని రైల్వే అధికారులు తెలిపారు. ఈరైలు తిరుపతిలో బుధవారం రాత్రి 8 గంటల 15 నిమిషాలకు బయలుదేరుతుందని, మరుసటి రోజు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు.

=======================

=======================